బలగం TV
BALAGAM
నిజమే మా బలం.. ప్రజలే మా బలగం
BALAGAM TV DIGITAL NEWS PAPER | balagamtv100@gmail.com
హైదరాబాద్ మంగళవారం 31 డిసెంబర్ 2024 | www.balagamtv.com | పేజీలు 4

## ఐదు వ్యవసాయ మార్కెట్‌లకు నూతన పాలకవర్గాలు

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**
రాష్ట్రంలోని మరో ఐదు వ్యవసాయ మార్కెట్లకు నూతన పాలకవర్గాలను నియమించినట్లు వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. ఈ మేరకు సోమవారం ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఆదిలాబాద్ జిల్లా ఇందర్‌వల్లి, మంచిర్యాల జిల్లా జన్నారం, సూర్యాపేట జిల్లా కోదాడ, పెద్దపల్లి జిల్లా రామగుండం, కామారెడ్డి జిల్లా కామారెడ్డి వ్యవసాయ మార్కెట్ కమిటీలకు నూతన పాలక వర్గాలు ఏర్పాటు అయ్యాయి. ఇప్పటివరకు రాష్ట్ర వ్యాప్తంగా 145 వ్యవసాయ మార్కెట్ కమిటీ-లకు నూతన పాలకవర్గాన్ని నియమించడం జరిగింది. నూతనంగా ఎన్నికైన పాలకవర్గ సభ్యులకు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అభినందనలు తెలిపారు.

## ప్రభుత్వ కార్యక్రమాల్లో
# భాగస్వామిగా ఉంటాం



- నైపుణ్యాభివృద్ధి..మౌలిక వసతుల పెంపు సీఎం దార్శనికతకు నిదర్శనం
- మైక్రోసాఫ్ట్ కార్పొరేషన్ ప్రెసిడెంట్ సత్య నాదెళ్ల
- సీఎం రేవంత్ రెడ్డి ప్రత్యేక భేటీ
- మైక్రోసాఫ్ట్ పెట్టుబడులను విస్తరిస్తున్నందుకు సత్య నాదెళ్లకి సీఎం కృతజ్ఞతలు


**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**
తెలంగాణ ప్రభుత్వం చేపట్టే అన్ని కార్యక్రమాల్లో భాగస్వామిగా ఉంటామని మైక్రోసాఫ్ట్ కార్పొరేషన్ ప్రెసిడెంట్ సత్య నాదెళ్ల తెలిపారు. సోమవారం హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లోని ఆయన నివాసంలో మంత్రులు శ్రీధర్‌బాబు, ఉత్తమ్ కుమార్‌రెడ్డితో కలిసి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సోమవారం ఆయనతో భేటీ అయ్యారు. మంత్రివర్యులు ఉత్తమ్ కుమార్ రెడ్డి గారు, దుద్దిళ్ల శ్రీధర్ బాబుతో కలిసి సీఎం హైదరాబాద్‌లోని సత్య నాదెళ్ల నివాసంలో సమావేశమయ్యారు.

తెలంగాణ ప్రభుత్వం చేపట్టే అన్ని కార్యక్రమాల్లో భాగస్వామిగా ఉండాలనే తమ నిబద్ధతను కొనసాగిస్తామని సత్య నాదెళ్ల తెలిపారు. ఈ సందర్భంగా నైపుణ్యాభివృద్ధి, భవిష్యత్ అవసరాలకు తగినట్లు మౌలిక సదుపాయాలను మెరుగుపర్చే విషయంలో ముఖ్యమంత్రి దార్శనికతను సత్య నాదెళ్ల ప్రశంసించారు. ప్రజా ప్రభుత్వం తలపెట్టిన నైపుణాభివృద్ధి, మెరుగైన మౌలిక వసతల కల్పన వంటి అంశాలు ఆర్థికాభివృద్ధికి దోహదపడటంతో పాటు హైదరాబాద్‌ను ప్రపంచంలోని టాప్ నగరాల్లో ఉంచగలవని సత్య నాదెళ్ల అభిప్రాయపడ్డారు.

టెక్నాలజీ రంగంలో హైదరాబాద్‌ను ప్రపంచంలోనే అగ్రగామి నగరంగా తీర్చిదిద్దేలా రాష్ట్ర ప్రభుత్వం ఏఐ, Gen AI , క్లౌడ్ ఆధారిత వ్యవస్థల అభివృద్ధిపై దృష్టి సారించిందని, ఈ ప్రయత్నాలకు మైక్రోసాఫ్ట్ సంస్థ కూడా మద్దతుగా నిలవాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి , ఐటీ శాఖ మంత్రి శ్రీధర్‌బాబు సత్య నాదెళ్లకి విజ్ఞప్తి చేశారు. హైదరాబాద్‌లోని తొలి సాంకేతిక సంస్థల్లో మైక్రోసాఫ్ట్ ఒకటని, ప్రస్తుతం 10,000 మందికి ఉపాధి కల్పిస్తోన్న విషయాన్ని గుర్తుచేసిన ముఖ్యమంత్రి .. రాష్ట్రంలోని 600 మెగావాట్ల సామర్థ్యం కలిగిన డేటా సెంటర్ లోనూ మైక్రోసాఫ్ట్ పెట్టుబడి పెట్టిన అంశాన్ని ప్రస్తావిస్తూ హైదరాబాద్‌తో పాటు తెలంగాణవ్యాప్తంగా మైక్రోసాఫ్ట్ పెట్టుబడులను విస్తరిస్తున్నందుకు సత్య నాదెళ్లకి కృతజ్ఞతలు తెలిపారు.

రీజినల్ రింగ్ రోడ్డు, రేడియల్ రోడ్లు, ఫ్యూచర్ సిటీ, కొత్త మ్యానుఫ్యాక్చరింగ్ క్లస్టర్ల అభివృద్ధి, రాష్ట్రంలో మౌలిక వసతులు కల్పనకు అమలు చేస్తున్న ప్రణాళికలు, యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ వంటి సంస్థల ద్వారా పరిశ్రమలకు అవసరమైన ప్రతిభావంతులను అందుబా టులో ఉంచేందుకు ప్రజా ప్రభుత్వం చేస్తున్న కృషిని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సత్య నాదెళ్ల కి వివరించారు. ఈ సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, ఐటీ, పరిశ్రమల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేశ్ రంజన్ గారు, ముఖ్య మంత్రి ప్రత్యేక కార్యదర్శి అజిత్ రెడ్డి పాల్గొన్నారు.

- పేదల కోసం కీలక చట్టాలు చేశారు
- ఫైనాన్స్ డిస్ట్రిక్ట్‌లో విగ్రహం ఏర్పాటు చేస్తాం
- మాజీ ప్రధాని సంతాప తీర్మానంలో సీఎం రేవంత్‌రెడ్డి
- తీర్మానానికి ఆమోదం తెలిపిన బీఆర్ఎస్, బీజేపీ, సీపీఐ
- అసెంబ్లీ మన్మోహన్‌కు ఘన నివాళులు



# మన్మోహన్ సింగ్‌కు భారతరత్న ఇవ్వాలి

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**
భారతదేశాన్ని ప్రపంచంలో మేటిగా నిలబెట్టేందుకు కృషి చేసిన దార్శనికుడు డాక్టర్ మన్మోహన్ సింగ్‌కి అత్యున్నత పౌర పురస్కారం భారతరత్న ప్రధానం చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరుతూ, సభా నాయకుడు, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రవేశపెట్టిన తీర్మానాన్ని శాసనసభ ఏకగ్రీవంగా ఆమోదించింది అలాగే, తెలంగాణ ప్రజల 60 ఏండ్ల ఆకాంక్షలను నెరవేర్చిన గొప్ప నాయకుడిగా, భావి తరాలు స్మరించుకునేలా డాక్టర్ మన్మోహన్ సింగ్ విగ్రహాన్ని హైదరాబాద్‌లో ఏర్పాటు చేయాలన్న ప్రతిపాదనను సభ ఆమోదించింది.

మాజీ ప్రధానమంత్రి, ఆర్థిక వేత్త డాక్టర్ మన్మోహన్ సింగ్ గారి మృతికి సంతాపం తెలియజేస్తూ శాసనసభ ప్రత్యేకంగా సమావేశమైంది. దేశ పురోగతికి డాక్టర్ మన్మోహన్ సింగ్ అందించిన సేవలు, తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు పురుడుపోసి ప్రజల గుండెల్లో శాశ్వతంగా నిలిచిపోయే గొప్ప నాయకుడిగా వారి కృషిని స్మరిస్తూ ముఖ్యమంత్రి తీర్మానం ప్రవేశపెట్టారు. శాసనసభలో ముఖ్యమంత్రి ప్రవేశపెట్టి తీర్మానం...

"భారత మాజీ ప్రధానమంత్రి డాక్టర్ మన్మోహన్ సింగ్ మృతి పట్ల ఈ శాసనసభ తీవ్ర సంతాపాన్ని వ్యక్తం చేస్తోంది. శోకార్తులైన వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తుంది. అంతర్జాతీయ ప్రఖ్యాతి పొందిన ఆర్థికవేత్త డాక్టర్ మన్మోహన్ సింగ్ గారు దేశానికి విశిష్టమైన సేవలను అందించారు. కేంద్ర ప్రభుత్వ ప్రధాన ఆర్థిక సలహాదారుగా, భారత రిజర్వ్‌బ్యాంక్ గవర్నర్‌గా, ప్రణాళిక సంఘం డిప్యూటీ చైర్‌పర్సన్‌గా, కేంద్ర ఆర్థిక మంత్రిగా, భారత ప్రధానమంత్రిగా వివిధ హోదాలలో వారు ఈ దేశానికి ఎన్నో సేవలను అందించారు. డాక్టర్ మన్మోహన్ సింగ్ దేశంలో ఆర్థిక సంస్కరణల రూపశిల్పి. 1991 మరియు 1996 మధ్య కేంద్ర ఆర్థిక మంత్రిగా దేశ ఆర్థిక వ్యవస్థను సరళీకరించి ఆర్థిక స్థితిగతుల దశ దిశను మార్చే నిర్మాణాత్మక సంస్కరణలు అమలు చేయడంలో కీలక పాత్ర పోషించారు.

ప్రపంచీకరణ, సరళీకరణ, ప్రైవేటీకరణ విధానాలతో అంతర్జాతీయ స్థాయిలో భారత ఆర్థిక వ్యవస్థను సుస్థిరంగా నిలబడేలా చేయగలిగారు. 2004 మరియు 2014 మధ్య భారత ప్రధానమంత్రిగా ఉన్న మన్మోహన్ సింగ్ గారు తన పదవీకాలంలో ఎన్నో చారిత్రాత్మకమైన సామాజిక కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. తెలంగాణ బిడ్డ పీవీ నరసింహారావు ప్రధానమంత్రిగా ఉన్నప్పుడు ఆర్థిక మంత్రిగా వారు వేసిన పునాదులు ఈరోజు భారతదేశం ప్రపంచ దేశాలతో మనం పోటీ పడుతున్నాం. ప్రపంచమే గర్వించదగ్గ ఆర్థికవేత్త. వారిని కోల్పోవడం దేశానికి తీరని లోటు.

ప్రజలకు ఉపాధి కల్పించే మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం, పరిపాలనలో పారదర్శకతను చాటి చెప్పే సమాచార హక్కు చట్టం, ప్రజారోగ్యానికి ప్రాధాన్యతను ఇచ్చిన జాతీయ గ్రామీణ ఆరోగ్య మిషన్ ప్రారంభించారు. ప్రతి పౌరుడికి ఆధార్ కార్డు లాంటి సామాజిక విప్లవాత్మక కార్యక్రమాలను వారి హయాంలోనే మొదలయ్యాయి. ఉపాధి హామీ పథకంతో ఏడాదికి కనీసం వంద రోజుల పని కల్పించడం ద్వారా పేదలకు ఆహార భద్రత కల్పించవచ్చన్న గొప్ప లక్ష్యంతో ఉమ్మడి రాష్ట్రంలో అనంతపూర్‌లో, తెలంగాణలోని మహబూబ్‌నగర్‌లో ఆ కార్యక్రమాన్ని దేశానికి అంకితం చేయడం జరిగింది.

భూ సేకరణ సందర్భాల్లో నిరాశ్రయులవుతున్న వారికి అండగా నిలవాలని, వారికి నష్టం జరక్కుండా ఉండాలని ఆనాడు డాక్టర్ మన్మోహన్ సింగ్ గారు 2013 భూసేకరణ చట్టంలో గణనీయమైన మార్పులు తీసుకొచ్చారు. అటవీ ప్రాంతాల్లో ఉన్న ఆదివాసీలు, గిరిజనులను ఆదుకోవడానికి 2006 లో అటవీ హక్కుల చట్టాన్ని సవరించడం ఆదివాసీల్లో చిరస్థాయిగా నిలిచిపోతారు. 4 కోట్ల తెలంగాణ రాష్ట్ర ప్రజలు డాక్టర్ మన్మోహన్ సింగ్ గారికి ఎంతో

మిగితా 2వ పేజీలో

## మన్మోహన్ సింగ్ గొప్పదనాన్ని గుర్తించింది పీవీ



- ఆర్థికరంగంలో దేశాన్ని ముందుకు నడిపించిన మన్మోహన్‌సింగ్... సైలెంట్ ఆర్కిటెక్ట్ ఆఫ్ మోడ్రన్ ఇండియా
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**
మన్మోహన్ సింగ్ గొప్పతనం, సామర్థ్యం, జ్ఞానాన్ని ముందుగా గుర్తించిన వ్యక్తి తెలంగాణ బిడ్డ పీవీ నరసింహారావు అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్ అన్నారు. గొప్ప ఆలోచనకు అరుదైన సందర్భం వచ్చినప్పుడు ప్రపంచంలో ఏ శక్తి ఆపలేదని చెప్పారు. మన్మోహన్ సింగ్ హయాంలోనే తెలంగాణ ఏర్పడిందని తెలిపారు. కేంద్రంలో ఓబీసీ శాఖను ఏర్పాటు చేయాలని మన్మోహన్ సింగ్‌ను కేసీఆర్ కోరారని గుర్తుచేశారు. అసెంబ్లీ ప్రత్యేకంగా సమావేశం అయింది. మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్‌కు సభ సంతాపం తెలిపింది. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. 'దివంగత మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్‌కు

మిగితా 2వ పేజీలో

### తెలంగాణ ప్రజాప్రతినిధుల
## సిఫారసు లేఖలకు ఏపీ సీఎం గ్రీన్ సిగ్నల్..



- వారానికి రెండుసార్లు రూ.300 దర్శనానికి సంబంధించిన సిఫారసు లేఖలకు చంద్రబాబు ఆమోదం


**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**
ప్రముఖ పుణ్యక్షేత్రమైన తిరుమలలో తెలంగాణకు చెందిన ప్రజాప్రతినిధుల లేఖలను టీటీడీ అనుమతించడం లేదనే విమర్శలు గత కొద్దిరోజులుగా కొనసాగుతున్నాయి. ఈ క్రమంలో తిరుమల తిరుపతి దేవస్థానం చైర్మన్ బీఆర్ నాయకుడు ఆ రాష్ట్ర ముఖ్య మంత్రి నారా చంద్రబాబు నాయుడుతో సమావేశమై సిఫారసు లేఖల అంశంపై సోమవారం చర్చించారు. తెలంగాణ ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలకు వారానికి రెండు సిఫార్సు లేఖలకు అనుమతిస్తూ టీటీడీ తీసుకున్న నిర్ణయానికి సీఎం అంగీకరించారు. వారానికి రెండుసార్లు రూ.300 దర్శనానికి సంబంధించిన సిఫారసు లేఖలకు చంద్రబాబు ఆమోదం తెలిపారు.

దేవస్థానం తెలంగాణ ప్రజాప్రతినిధుల సిఫారసు లేఖలను అనుమతించకపోవడం వివాదాస్పదంగా మారింది. అయితే, గత కొద్దిరోజుల కిందట టీటీడీ ఈవో శ్యామల రావు శ్రీవారి దర్శనానికి ఏపీ నుంచి వచ్చిన సిఫారసు లేఖలు మాత్రమే అనుమతిస్తున్నామని.. తెలంగాణ ప్రజాప్రతినిధుల సిఫారసు లేఖలను తీసుకోవడం లేదని స్పష్టం చేశారు. అయితే, విషయంలో రాష్ట్రానికి చెందిన పలువురు ప్రజాప్రతినిధులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ క్రమంలోనే టీటీడీ పాలక మండలి సమావేశంలో తెలంగాణ ప్రజాప్రతినిధుల సిఫారసు లేఖల అంశంపై చర్చించారు. బోర్డు సభ్యులు లేఖలను పరిగణలోకి తీసుకోవాలని సూచించారు. పాలకమండలి నిర్ణయం మేరకు బోర్డు చైర్మన్ బీఆర్ నాయుడు చంద్రబాబుతో చర్చించారు. ఈ సందర్భంగా సిఫారసు లేఖలకు సీఎం ఆమోదం తెలిపారు.

## పీఎస్ఎల్వీ సి-60 ప్రయోగం విజయవంతం


- శ్రీహరి కోట నుంచి ఉపగ్రహ వాహననౌక
- భవిష్యత్ పరిశోధనలకు కీలకం

వివరాలు 3వ పేజీలో



## గోటితో పోయే దాన్ని గొడ్డలి దాకా తెచ్చారు

- ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్



**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**
అల్లు అర్జున్ వివాదంపై ఏపీ ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ స్పందించారు. పవన్ కల్యాణ్ సోమవారం చిట్‌చాట్‌లో మాట్లాడారు. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గొప్ప నాయకుడని అన్నారు. ఆయన కిందిస్థాయి నుంచి ఎదిగారని అన్నారు. వైఎస్సార్‌సీపీ విధానాల తరహాలో తెలంగాణలో వ్యవహరించలేదని పవన్ అభిప్రాయపడ్డారు. తెలంగాణలో బెనిఫిట్ షోలకు రేవంత్ రెడ్డి అవకాశం కల్పించారని గుర్తు చేశారు. టికెట్ ధరలు పెంపునకు కూడా అవకాశం కల్పించారని అన్నారు. అభిమాని చనిపోతే వెంటనే పరామర్శకు వెళ్లి ఉండాల్సిందని పవన్ అభిప్రాయపడ్డారు. అల్లు అర్జున్ కాకున్నా కనీసం నిర్మాతలైనా వెళ్లి ఉండాల్సిందన్నారు.

అల్లు అర్జున్ విషయంలో ఎక్కడో మానవతా దృక్పథం లోపించిందని అన్నారు. అందరూ రేవతి ఇంటికి వెళ్లి భరోసా ఇచ్చి ఉండాల్సిందని అభిప్రాయపడ్డారు. పరామర్శించకపోవడం వల్ల ప్రజల్లో ఆగ్రహం వచ్చిందని తెలిపారు. పుష్ప సినిమాకు సీఎం రేవంత్ రెడ్డి సహకరించారన్నారు. సీఎం హోదాలో రేవంత్ రెడ్డి స్పందించారని తెలిపారు. కొన్నిసార్లు పరిస్థితులను బట్టి నిర్ణయాలు ఉంటాయని ఆయన తెలిపారు. రేవంత్ చాలా డైనమిక్ లీడర్ అన్న ఆయన, తెలంగాణ సీఎం సహకారంతోనే సినిమాల కలెక్షన్లు పెరిగాయని గుర్తు చేశారు. ఇదే సమయంలో తెలంగాణ ప్రభుత్వం సాఫ్ట్‌గా వెళ్లి ఉంటే బాగుండేదని అభిప్రాయపడ్డారు.

## తెలంగాణలో కమీషన్ ఇస్తేనే పనులు

- కేంద్ర మంత్రి బండి సంజయ్



**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**
తెలంగాణలో కమీషన్ సర్కార్ నడుస్తోందని.. 14 శాతం కమీషన్ ఇస్తేనే బిల్లులు మంజూరవుతున్నట్లు కేంద్ర మంత్రి బండి సంజయ్ సంచలన ఆరోపణలు చేశారు. 'కాంగ్రెస్ పెద్దలకు కప్పం కట్టడంపై ఉన్న శ్రద్ధ ప్రజా సమస్యలపై లేదు. కాంగ్రెస్ సర్కార్ కమీషన్ సర్కార్. 14 శాతం కమీషన్ ఇవ్వనిదే బిల్లులు మంజూరు కావడం లేదు' అని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ సంచలన ఆరోపణలు చేశారు. కమీషన్ విషయంలో మంత్రుల మధ్యే యుద్ధం మొదలైందని సంచలన ప్రకటన చేశారు. మాజీ సర్పంచ్‌లకు బిల్లులివ్వకుండా నిండా ముంచిందని మండిపడ్డారు. గ్రామాల్లో జరిగిన అభివృద్ధి పనులన్నీ మాజీ సర్పంచ్‌లు చేసినవేనని స్పష్టం చేశారు. కరీంనగర్‌లో ఓ కార్యక్రమానికి హాజరైన కేంద్ర మంత్రి బండి సంజయ్ కీలక వ్యాఖ్యలు చేశారు. రేవంత్ రెడ్డి పాలనపై తీవ్ర విమర్శలతోపాటు ఆరోపణలు చేశారు. 'మాజీ సర్పంచ్‌లకు బిల్లులివ్వకుండా అప్పుల పాల్జేయడం దుర్మార్గం. కాంగ్రెస్ మెడలు వంచి బిల్లులు చెల్లించేలా చేస్తాం. చేతగాని కాంగ్రెస్ సర్కార్ వల్లే రాష్ట్రంలో నేరాల సంఖ్య పెరిగింది. 6 గ్యారంటీలపై చర్చ జరగకుండా దారి మళ్లించేందుకు కాంగ్రెస్ డ్రామాలాడుతోంది' అని మండిపడ్డారు.

'కాంగ్రెస్ ప్రభుత్వం ఏ బిల్లు మంజూరు కావాలన్నా 8 నుంచి 14 శాతం కమీషన్లు దండుకుంటోంది' అని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ సంచలన ఆరోపణలు చేశారు. నిజాయతీగా ఉన్న కొందరు మంత్రుల్లో ఈ విషయం ఏ మాత్రం నచ్చడం లేదని పేర్కొన్నారు. 'కమీషన్లపై కాంగ్రెస్ పార్టీలో అంతర్యుద్ధం నడుస్తోంది. ఎప్పుడైనా కమీషన్ల బాగోతం బద్దలు కావొచ్చు' అని కీలక వ్యాఖ్యలు చేశారు. 'కమీషన్ల మోజులో పడి ఢిల్లీ కాంగ్రెస్ నేతలకు కప్పం కడుతూ తమ సీటును కాపాడుకోవడానికే కాంగ్రెస్ పాలకులు పరిమితమయ్యారు. ప్రజా సమస్యలను పూర్తిగా గాలికొదిలేశారు' అని మండిపడ్డారు.

'ఈ ప్రభుత్వాన్ని కాపాడటం ఎవరి తరమూ కాదనే సంగతి గుర్తుంచుకోవాలి' అని బండి సంజయ్ తెలిపారు. పెండింగ్ బిల్లులు మంజూరు కావాలంటే వాళ్లకు 8 నుంచి 14 శాతం కమీషన్లు ఇస్తే మీ నిధులన్నీ విడుదలవుతాయని పేర్కొన్నారు. కమీషన్లు దండుకునేందుకు ప్రత్యేకంగా ముగ్గురు మంత్రులను పెట్టుకున్నారు అని చ్చెరు. 14 శాతం కమీషన్లు ఎవరైతే ఇస్తారో వాళ్లకే బిల్లులు మంజూరవుతున్నాయని పునరుద్ఘాటించారు. రేవంత్ రెడ్డి పాలనతో ఒక్క వర్గం కూడా సంతోషంగా లేదని చెప్పారు.

'ఫీజు రీయంబర్స్‌మెంట్, ఆరోగ్యశ్రీ బకాయిలు విడుదల చేయకపోవడంతో విద్యార్థులు, పేదలు ఇబ్బందులు పడుతున్నారు. శాంతి భద్రతలను కాపాడలేని చేతగాని రేవంత్ రెడ్డి పాలన నడుస్తోంది. వీళ్లకు ప్రజల బాధలు పట్టవు' అని బండి సంజయ్ తెలిపారు. మన్మోహన్ సింగ్, అంబేద్కర్‌లను బీజేపీ అవమానించిందంటూ వస్తున్న ఆరోపణలపై స్పందిస్తూ.. 'అంబేద్కర్‌ను అవమానించిందే కాంగ్రెస్ పార్టీ. ఆయనకు భారతరత్న ఎందుకు ఇవ్వలేదు?' అని ప్రశ్నించారు. మన్మోహన్ సింగ్‌ను లోక్‌సభ ఎన్నికల్లో ఎందుకు ఓడించారు? అని నిలదీశారు.

## 3డీ వ్యూహంలో రేవంత్ రెడ్డి సర్కార్



**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**
తెలంగాణలో గత ఏడాది కాలం నుంచి రేవంత్ రెడ్డి ప్రభుత్వం త్రీడీ వ్యూహంతో ముందుకు వెళ్తున్నట్లు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. త్రీడీవ్యూహం అంటే.. విధ్వంసం(డిస్ట్రక్షన్), దారిమళ్లింపు(డైవర్షన్), దృష్టిమళ్లించడం(డిస్ట్రాక్షన్) అని ఆయన పేర్కొన్నారు. ఈ ఐడియాలజీతోనే రేవంత్ ప్రభుత్వం రాజకీయ ప్రతీకారానికి తెగించిందన్నారు. ఆ నెపంతోనే

మిగితా 2వ పేజీలో




### రాష్ట్రంలో
## 10 మంది ఐపీఎస్ అధికారులు బదిలీ

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**
తెలంగాణలో తాజాగా 10 మంది ఐపీఎస్ ఆఫీసర్లు బదిలీ అయ్యారు. 2021, 2022 బ్యాచ్‌లకు చెందిన ఐపీఎస్ ఆఫీసర్లను బదిలీ చేసినట్లు అధికారులు పేర్కొన్నారు. ఆదిలాబాద్ జిల్లాలోని ఉట్నూర్ ఏఎస్పీగా కాజల్ (2021), రాచకొండ పోలీసు కమిషనరేట్ పరిధిలోని భువనగిరి ఏఎస్పీగా కంకణాల రాహుల్ రెడ్డి(2021), ఆసిఫాబాద్ ఏఎస్పీగా చిత్తరంజన్(2022), కామారెడ్డి ఏఎస్పీగా బొక్కా చైతన్య(2022), జనగామ ఏఎస్పీగా పందిరే చైతన్య రెడ్డి(2022), భద్రాచలం ఏఎస్పీగా విక్రాంత్ కుమార్ సింగ్, కరీంనగర్ రూరల్ ఏఎస్పీగా నగ్రాలే శుభం ప్రకాశ్(2022), నిర్మల్ ఏఎస్పీగా రాజేశ్ మీనా(2022), దేవరకొండ ఏఎస్పీగా పీ మౌనిక(2022) బదిలీ అయ్యారు.

## అమెరికా మాజీ అధ్యక్షుడు జిమ్మీ కన్నుమూత

- ప్రధాని మోడీ సంతాపం



**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**
అమెరికా మాజీ అధ్యక్షుడు జిమ్మీ కార్టర్ (100) కన్నుమూశారు. అనారోగ్య కారణాలతో జార్జియా లోని ప్లెయిన్స్‌లో తుదిశ్వాస విడిచినట్లు ఆయన తనయుడు జేమ్స్ ఇ కార్టర్ 3 తెలిపారు. జిమ్మీ కార్టర్ మృతిపట్ల అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ ప్రథమ మహిళ జిల్ సంతాపం తెలిపారు. వ్యాధుల నిర్మూలన, శాంతి స్థాపన, పౌర, మానవ హక్కుల అభివృద్ధి , స్వేచ్ఛాయుత ఎన్నికలు తదితర అంశాల్లో ఆయన అధ్యక్షుడిగా తనదైన ముద్రవేశారని బైడెన్ పేర్కొన్నారు. జిమ్మీ మృతి పట్ల కాబోయే అధ్యక్షుడు ట్రంప్ సంతాపం తెలిపారు. అధికారిక అంత్యక్రియలకు ఏర్పాట్లు చేస్తున్నట్టు వైట్‌హౌస్ వెల్లడించింది. 1924 అక్టోబరు 1న జన్మించిన జిమ్మీ కార్టర్ , ఈ ఏడాది తన వందో పుట్టిన రోజును ఉత్సాహంగా సెలబ్రేట్ చేసుకున్నారు. జార్జియాలో పుట్టిన కార్టర్ 1977-81 మధ్య కాలంలో అగ్రరాజ్యానికి 39 వ అధ్యక్షుడిగా పనిచేశారు. ఓ రైతుగా, నేవీ ఉద్యోగిగా, గవర్నర్, ప్రెసిడెంట్‌గా , అన్నింటికీ మించి మానవతావాదిగా ప్రపంచానికి ఆయన సుపరిచితులు. 2002 నోబెల్ శాంతి బహుమతిని అందుకున్నారు. క్యాన్సర్ వంటి మహమ్మారినీ జయించిన దృఢ సంకల్పం ఆయన సొంతం. ప్రపంచానికి పెద్దన్న లాంటి అమెరికాకు అధ్యక్షునిగా పనిచేసి , వందేళ్ల

మిగితా 2వ పేజీలో

# స్తంభించిన పంజాబ్..



**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

రైతు డిమాండ్ల పరిష్కారంలో కేంద్రం నిర్లక్ష్య వైఖరిని నిరసిస్తూ రైతు సంఘాలు సోమవారం పంజాబ్ బంద్‌కు పిలుపునిచ్చాయి. అన్నదాతల డిమాండ్లను నెరవేర్చాలంటూ పంజాబ్ వ్యాప్తంగా కిసాన్ మజ్దూర్ మోర్చా, సంయుక్త కిసాన్ మోర్చా బంద్ చేపట్టింది. ఈ బంద్‌తో రాష్ట్రం మొత్తం స్తంభించిపోయింది. రైతులు పెద్ద ఎత్తున రోడ్లపైకి వచ్చి బంద్‌లో పాల్గొన్నారు. వాణిజ్య, వ్యాపార, విద్యా సంస్థలు మూతపడ్డాయి. రోడ్డు, రైలు మార్గాలను రైతులు దిగ్బంధించారు. అమృత్‌సర్‌లోని గోల్డెన్ గేట్, బటిండాలోని రాంపురా ఫుల్, మొహాలీలోని ఐఐఎస్ఈఆర్ చౌక్ వద్ద ఎయిర్‌పోర్ట్ రోడ్డు, కురాలి రోడ్ టోల్ ప్లాజా, లాల్రూ సమీపంలోని అంబాలా ఢిల్లీ హైవే, ఖరార్ మొరిండా హైవే సహా కీలక మార్గాలను రైతులు దిగ్బంధించారు.

పంజాబ్ అంతటా ప్రధాన రహదారులు, మార్కెట్ ప్రాంతాలు మూతపడ్డాయి. మొత్తంగా రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 200కిపైగా రోడ్లను రైతులు బ్లాక్ చేశారు. దీంతో రవాణా సేవలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. మరోవైపు రైతుల బంద్ రైళ్ల రాకపోకలపై కూడా తీవ్ర ప్రభావం పడింది. ఢిల్లీ %-% పంజాబ్ మధ్య రాకపోకలు సాగించే దాదాపు 163 రైల్వే సర్వీసులకు రద్దయ్యాయి.

విమానాలు, వైద్య, పెళ్లి, ఉద్యోగ ఇంటర్వ్యూ సహా అత్యవసర సేవలను బంద్ నుంచి మినహాయింపు ఇచ్చారు. రైతుల బంద్ నేపథ్యంలో పంజాబ్ పోలీసులు అప్రమత్తమయ్యారు. మొహాలి జిల్లా అంతటా దాదాపు 600 మంది పోలీసు సిబ్బంది మోహరించారు. సీనియర్ పోలీస్ అధికారులు పరిస్థితిని నిశితంగా పర్యవేక్షిస్తున్నారు. ఉదయం 7 నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఈ బంద్ కొనసాగనున్నట్లు రైతు సంఘాలు ప్రకటించాయి.

# మన్మోహన్ సింగ్‌కు భారతరత్న ఇవ్వాలి

(మొదటి పేజీ తరువాయి)

రుణపడి ఉన్నారు. వారు ప్రధానమంత్రిగా ఉన్నప్పుడే తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు మార్గం సుగమమైంది. 2014 లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పునర్వ్యవస్థీకరణ చట్టాన్ని పార్లమెంట్ ఆమోదించింది. ఎన్నో ఏండ్ల పోరాటం ఫలించి తెలంగాణ రాష్ట్రం ఏర్పడింది. మన్మోహన్ సింగ్ గారు దేశానికి ముఖ్యంగా తెలంగాణకు చేసిన సేవలకు ఈ సభ అపారమైన కృతజ్ఞతలను తెలియ జేస్తుంది.

మన్మోహన్ సింగ్ తెలంగాణకు ఆత్మబంధువు. 60 ఏళ్ల తెలంగాణ కలను సాకారం చేసిన నాయకుడు. తెలంగాణ ప్రజలకు శ్రీమతి సోనియాగాంధీ గారు ఇచ్చిన మాటను పార్లమెంటరీ ప్రక్రియలో నెరవేర్చే బాధ్యతతో ప్రధానమంత్రి హోదాలో తెలంగాణకు రాష్ట్ర హోదా కల్పించిన గొప్ప మానవతావాది. తెలంగాణతో ఆయన అనుబంధం విడదీయలేనిది. రాష్ట్రం ఉన్నంత వరకు మర్చిపోలేనిది. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు ప్రక్రియలో... రాజ్యసభలో ఒక దశలో రాజ్యాంగ సవరణల కోసం వచ్చిన చర్చలు తెలంగాణ రాష్ట్రం వెనక్కి పోతుందేమో అన్నంత గందరగోళ పరిస్థితులు ఏర్పడిన సందర్భంలో మన్మోహన్ సింగ్ గారికి అత్యంత సన్నిహితుడిగా అత్యంత నమ్మకమైన సహచరుడుగా జైపాల్ రెడ్డి గారితో మాట్లాడి వ్యూహాత్మక చతురతతో సమన్వయ పరిచి ఆ సవరణలకు ప్రధానమంత్రి వెళ్లి రాజ్యసభలో ప్రకటన ఇప్పించిన సందర్భం మనం ఎప్పటికీ మర్చిపోలేని సందర్భం.

ఈ రాష్ట్రానికి పురుడు పోసిన డాక్టర్‌గా మన్మోహన్ సింగ్ గారిని తెలంగాణ సమాజం ఎప్పటికీ గుండెల్లో పెట్టుకుంటుంది. అటువంటి మహనీయుడికి నాలుగు కోట్ల తెలంగాణ ప్రజల తరఫున ఈ శాసనసభ ద్వారా రాజకీయాలు పార్టీలకు అతీతంగా కృతజ్ఞతలు తెలపడమే కాక ఘన నివాళి అర్పించాల్సిన అవసరం ఉంది.దేశం ఒక గొప్ప నాయకుడిని కోల్పోయిన సందర్భంగా ఈరోజు తెలంగాణ శాసనసభ ఒకరోజు ప్రత్యేకంగా సమావేశాలను ఏర్పాటు చేసి రాజకీయాలకు అతీతంగా వారికి భారతరత్న ఇవ్వాలని ఈ సభలో సభ్యులందరి ఆమోదం కోరుతూ ఈ తీర్మానాన్ని ప్రవేశపెట్టాం. భారతదేశాన్ని ప్రపంచ స్థాయిలో మేటి దేశంగా నిలబెట్టేందుకు వారు చూపిన దార్శనికత ఆయన చేసిన కృషిని అందరూ గుర్తుంచుకోవాలి, భావితరాలు స్మరించు కోవాలి. డాక్టర్ మన్మోహన్ సింగ్ గారికి అత్యున్నత పురస్కారం భారతరత్న ప్రధానం ప్రధానం చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరుతూ ఈ సభ తీర్మానం చేస్తుంది.

తెలంగాణ ఏర్పాటుకు విడదీయలేని అనుబంధం ఉన్న డాక్టర్ మన్మోహన్ సింగ్ గారి విగ్రహావిష్కరణ చేసుకోవడం ద్వారా శాశ్వతంగా మనం వారి వర్ధంతులు, జయంతులు, వారి జ్ఞాపకాలు శాశ్వతంగా తెలంగాణ ప్రజల గుండెల్లో పదిలమై ఉండే విధంగా ఒక మంచి ప్రాంతంలో వారి విగ్రహాన్ని ఏర్పాటు చేయడం సముచితమైన నిర్ణయం". ముఖ్యమంత్రి గారు ప్రవేశపెట్టిన ఈ తీర్మానంపై సమగ్ర చర్చ అనంతరం శాసనసభ దాన్ని ఏకగ్రీవంగా ఆమోదించింది.

**తీర్మానాన్ని బలపరుస్తున్నాం ఏలేటి మహేశ్వర్‌రెడ్డి**

మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ గొప్ప నేత అనీ, ఆయనపై శాసనసభలో ప్రవేశపెట్టిన తీర్మానాన్ని బలపరుస్తున్నామని బీజేపీ ఎల్పీనేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి చెప్పారు. ఈ సందర్భంగా ఆయన చేసిన వ్యాఖ్యలు వివాదాస్పదమయ్యాయి. పీవీ పట్ల కాంగ్రెస్ కక్ష పెంచుకున్నదని ఆరోపించారు. పదేండ్లు యూపీఏ ప్రభుత్వమే అధికారంలో ఉండగా పీవీకి భారతరత్న ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నించారు. తమ ఎన్డీఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఆయనకు ఆ పురస్కారాన్ని ఇచ్చామని గుర్తు చేశారు. ఒకానొక దశలో మన్మోహన్‌సింగ్ తెచ్చిన ఆర్డినెన్స్ కాపీలను రాహుల్‌గాంధీ చించేశారని వ్యాఖ్యానించారు. ఓపక్క మాజీ ప్రధాని మన్మోహన్ మృతికి కేంద్ర ప్రభుత్వం ఐదు రోజుల సంతాప దినాలు ప్రకటిస్తే.. రాహుల్ గాంధీ న్యూ ఇయర్ వేడుకల కోసం వియత్నాం వెళ్లడమేంటని నిలదీశారు. ఈ దశలో శాసనసభా వ్యవహారాల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు జోక్యం చేసుకుంటూ... సంతాప తీర్మానంపై ఇలా మాట్లాడటం సరిగాదన్నారు. ఆయన వ్యాఖ్యలను రికార్డుల నుంచి తొలగించాలంటూ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌ను కోరారు. ఆ వ్యాఖ్యలను తొలగిస్తున్నట్టు సభాపతి ప్రకటించారు. అయినా ఏలేటి మళ్లీ రాహుల్‌గాంధీపై అవే వ్యాఖ్యలు చేయడంతో మంత్రి పొన్నం సీరియస్ అయ్యారు. ఇది సభామర్యాద కాదని హితవు పలికారు. సభలో ఏవోమాటలు మాట్లాడి తానున్న (బీజేపీ) పార్టీలో పేరు తెచ్చుకోవాలని చూడటం ఏలేటికి మంచిది కాదని సూచించారు.

మంత్రి దామోదర రాజనర్సింహ మాట్లాడుతూ..దేశాన్ని ఆర్థిక ఇబ్బందుల నుంచి సంక్షేమం వైపు నడిపించిన మహనీయుడు మన్మోహన్‌సింగ్ అని కొనియాడారు. మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి మాట్లాడుతూ.. మన్మోహన్ సింగ్ సంస్కరణల్లో మానవీయ దృక్పథాన్ని జొప్పించారన్నారు. అటవీ హక్కుల చట్టం ద్వారా లక్షలాది మంది గిరిజనులకు ఉపయోగం జరిగిందని తెలిపారు. మన్మోహన్‌సింగ్ హయాంలో దేశంలోని రైతులందరి రుణాలు మాఫీ చేశారని గుర్తుచేశారు. ఎంఐఎం సభ్యులు మీర్ జుల్ఫికర్ అలీ మాట్లాడుతూ..మాజీ ప్రధాని మన్మోహన్ మృతికి సంతాపం, కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. దేశ ఆర్థిక రంగంలో ఆయన తీసుకొచ్చిన కీలక చర్యలు దేశ అభివృద్ధికి దోహదపడ్డాయని చెప్పారు. . బీఆర్ఎస్ సభ్యులు తలసాని శ్రీనివాస్ మాట్లాడుతూ.. దేశం ఇబ్బందికర పరిస్థితుల్లో ఉన్న సమయంలో పీవీ నర్సింహారావు ప్రధాని పదవిని చేపట్టారనీ, పీవీ-మన్మోహన్‌సింగ్‌తో కలిసి దేశాన్ని గాడిలో పెట్టారని కొనియాడారు.

## అమెరికా మాజీ అధ్యక్షుడు జిమ్మీ కన్నుమూత

(మొదటి పేజీ తరువాయి)

బతికిన తొలి వ్యక్తిగానూ నిలిచారాయన. 1978లో భారత్ పర్యటనకు కార్టర్ వచ్చారు. ఆయన పర్యటనకు గుర్తుగా హర్యానా లోని ఓ గ్రామానికి కార్టర్‌పురిగా నామకరణం చేశారు.

జిమ్మీకార్టర్‌మృతిపై ప్రధాని నరేంద్రమోడీ సంతాపం వ్యక్తం చేశారు. ఆయన గొప్ప రాజనీతిజ్ఞుడని , ప్రపంచ శాంతి సామరస్యం కోసం అవిశ్రాంతంగా కృషి చేశారని అన్నారు. భారత్ అమెరికాల మధ్య సంబంధాలను బలోపేతం చేయడంలో కార్టర్ సహకారం మరువలేనిదని వ్యాఖ్యానించారు. అగ్రరాజ్యానికి అధిపతిగా తనదైన ముద్రవేశారన్నారు. ఆయన కుటుంబ సభ్యులు, స్నేహితులకు సానుభూతిని తెలియజేస్తున్నట్టు పేర్కొన్నారు.

# బెట్టింగ్ యాప్‌లను ప్రమోషన్‌లు చేయకండి

- టిజిఎస్‌ఆర్టీసి ఎండి విసి సజ్జనార్

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

ఆన్‌లైన్ బెట్టింగ్ విషయంలో జాగ్రత్తగా ఉండాలని టీజీఆర్టీసీ ఎండీ సజ్జనార్ ట్వీట్ చేశారు. కాసులకు కక్కుర్తి పడి ఎంతో మంది ప్రాణాలను బలి తీసుకుంటున్న బెట్టింగ్ యాప్‌లను ప్రచారం చేయొద్దని సూచించారు. సోషల్ మీడియాలో వచ్చే వీడియోలను నమ్మి జీవితాలను నాశనం చేసుకోవద్దని కోరారు. రాత్రికి రాత్రే కోటీశ్వరులు కావొచ్చని.. ఇన్‌ఫ్లుయెన్సర్లు సోషల్ మీడియాలో విడుదల చేసే వీడియోల వల్ల అమాయకులు ఆన్ లైన్ బెట్టింగ్ మహమ్మారికి బానిసలవుతున్నారు. బంగారు జీవితాలను నాశనం చేసుకుంటున్నారు. ఇలాంటి వాటిపై యువత అప్రమత్తంగా ఉండాలని ఎక్స్ వేదికగా ట్వీట్ చేశారు. మీ స్వలాభం కోసం ప్రజాశ్రేయస్సును విస్మరించడం ఎంత వరకు సమంజసం..?. సమాజ క్షేమం పట్టని మీ పెడధోరణులు క్షమించరానివి. కష్టపడకుండానే కాసులు పోగేసుకోవాలన్న ఆలోచన అనర్థదాయకమైదని యువత గుర్తించాలన్నారు. స్వార్థ సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్ల మాటలు నమ్మి.. చాపకింద నీరులా సామాజిక సంక్షోభాన్ని సృష్టిస్తున్న ఆన్ లైన్ బెట్టింగ్ మాయలో పడకండి. ఇలాంటి సంఘ విద్రోహ శక్తులకు దూరంగా ఉండండని సజ్జనార్ ట్విట్టర్ వేదికగా కోరారు.

# మన్మోహన్ సింగ్ గొప్పదనాన్ని గుర్తించింది పీవీ

(మొదటి పేజీ తరువాయి)

నివాళులర్పించే సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి ప్రవేశపెట్టిన సంతాప తీర్మానానికి బీఆర్ఎస్ తరఫున పూర్తిగా మద్దతిస్తున్నాం. మన్మోహన్ సింగ్‌కు భారత రత్న ఇవ్వాలనే ప్రతిపాదనతో సంపూర్ణంగా ఏకీభవిస్తున్నాం మన్మోహన్ సింగ్ గొప్పదనాన్ని, సామర్థ్యాన్ని మొదటి సారిగా గుర్తించింది మన తెలంగాణ బిడ్డ పీవీ నరసింహా రావు అనేది నిర్వివాదాంశం. పీవీ నరసింహా రావు దేశ ప్రధానిగా ఎన్నికైన తర్వాత లాటరీ ఎంట్రీ ద్వారా రాజకీయాలతో సంబంధ లేని ఒక ఆర్థిక వేత్తను ఫైనాన్స్ మినిస్టర్‌గా నియమించారు. 1991లో బడ్జెట్ ప్రవేశపెడుతూ 'ప్రపంచం మొత్తం వినాల్సిన సమయం వచ్చింది. నా దేశం మేల్కొని ఉంది..' అంటూ ఆర్థిక వేత్తగా సంస్కరణలను ప్రవేశపెట్టే సందర్భంగా మాట్లాడారు. ఆ మాటలు.. ఆయన సిద్ధాంతం, పీవీ నరసింహారావు నాయకత్వం నేడు దేశంలో సమూల మార్పులు తీసుకొచ్చింది. కేవలం 15 రోజులు ఫారెక్స్ నిల్వలు ఉన్న నాటి రోజు నుంచి ప్రపంచమంతా ఆశ్యపడే స్థాయికి దేశాన్ని పరుగెత్తించిన ఆర్థిక సంస్కరణల శీలి డాక్టర్ మన్మోహన్ సింగ్. ఆయన ప్రధానిగా ఉన్న కాలంలోనే కేసీఆర్.. ఏడాదిన్నరపాటు కేంద్ర మంత్రిగా పనిచేశారు. నాటి కాంగ్రెస్ పార్టీతో పొత్తుపెట్టుకుని గెలుపొందిన తర్వాత భాగస్వామ్య పక్షాలను మంత్రివర్గంలోకి తీసుకున్నారు. కేసీఆర్‌కు షిప్పింగ్ మంత్రి పదవి ఇస్తే.. డీఎంకేతో చిక్కుముడి ఏర్పడింది. దీంతో మన్మోహన్ సింగ్ వద్దకు వెళ్లి తాను వచ్చింది పదవుల కోసమో, పోర్టుఫోలియోల కోసమో కాదు.. తెలంగాణ కోసమని చెప్పిన కేసీఆర్.. ఆ మంత్రిత్వ శాఖను డీఎంకేకి ఇచ్చారు. ఈ సందర్భంగా ఏ నిబద్ధతతో వచ్చారో అది ఫలించాలని కోరుకుంటున్నానని కేసీఆర్‌తో మన్మోహన్ అన్నారు. మీరు తీసుకున్న నిర్ణయంతో గుర్తింపు వస్తుందని, కర్మయోగిగా గుర్తించబడతారని అన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడి తర్వాత.. ఒక గొప్ప ఆలోచనకు అరుదైన సందర్భం వచ్చినప్పుడు ప్రపంచంలో ఏ శక్తీ ఆపలేదు. అలాగే మన్మోహన్ సింగ్ నమ్మారు కాబట్టే.. తెలంగాణ ఉద్యమంలో ఉన్న నిబద్ధత, ఉద్యమానికి ఉన్న బలం, తెలంగాణ ప్రజల పోరాట స్ఫూర్తి.. అన్నీ ఆయనకు అర్థమయ్యాయి కాబట్టే అనివార్య పరిస్థితుల్లో మన్మోహన్ సింగ్ నాయకత్వంలో తెలంగాణ ఏర్పడింది. దానిని తాము మర్చిపోం మన్మోహన్ సింగ్ నిబద్ధతను గుర్తుచేసే సందర్భంలో సరిగ్గా ప్రధానిగా వారు ఎన్నికైన తర్వాత ఆరు నెలలకు కేసీఆర్.. క్యాబినెట్ సహచరుడిగా డిసెంబర్ ముఖ్యమైన డెలిగేషన్ తీసుకొస్తున్నానని, తమకు సమయం ఇవ్వాలని కోరారు. బలహీన వర్గాలకు చెందిన నాయకులను తీసుకొస్తున్నానని, తమకు ఐదు నిమిషాలు సరిపోదని 30 నిమిషాలకు కావాలని కోరారు. సమస్య తీవ్రతను అర్థం చేసుకున్న నాటి ప్రధాని 45 నిమిషాలు సమయమిచ్చారు. ఆయన గొప్పతనమేంటంటే.. కేంద్రంలో ఓబీసీలకు ఒక మంత్రిత్వ శాఖ ఉండాలని ప్రధాని వద్దకు 2004, డిసెంబర్ 18న ఒక బృందాన్ని తీసుకెళ్తే, 45 నిమిషాలు సమయమిచ్చిన మన్మోహన్ సింగ్ గంటన్నరపాటు వారితో గడిపారు. ఎన్నో అడ్డంకులు, ఎన్నో అభ్యంతరాలున్నా మన్మోహన్ సింగ్ ప్రజా ఉద్యమాలకు అండగా నిలబడ్డారు. ఎన్నడూ కూడా, ఎన్ని ఒత్తిళ్లు ఎదురైనా సంస్కరణల బాట నుంచి వెనక్కి తగ్గలేదు. ఆయన్ని మనం సైలెంట్ ఆర్కిటెక్ట్ ఆఫ్ మోడ్రన్ ఇండియా అని పిలువవచ్చు. మన్మోహన్ కాదు ఈయన మౌన మోహన్ సింగ్ అని, మౌన ముని అని పేర్లు పెట్టారు. అయితే అవేవీ పట్టించుకోకుండా ఆయన పని ఆయన చేసుకుంటూ పోయారు. మన్మోహన్ సింగ్ గురించి మాట్లాడుకునేటప్పుడు మన తెలంగాణ బిడ్డ పీవీ నరసింహారావు గురించి కూడా గుర్తుచేసుకోవాలి. కేసీఆర్ ఆదేశాల మేరకు ఢిల్లీకి వెళ్లి మన్మోహన్ సింగ్‌కు నివాళులు అర్పించాం. అంత్యక్రియల్లో పాల్గొన్నాం. అనంతరం వారి కుటుంబ సభ్యులను పరామర్శించాం. అక్కడికి వెళ్లినప్పుడు మన్మోహన్ సింగ్‌కు జరిగిన గౌరవ ప్రదమైన వీడ్కోలు మన పీవీకి జరుగలేదనే బాధ అనిపించింది. మనవాడైన పీవీ నరసింహా రావుకు కూడా ఢిల్లీలో స్మారకం ఏర్పాటు చేయాలని తెలంగాణ శాసన సభ తీర్మానం చేయాలని, తెలంగాణ బిడ్డకు సముచిత గౌరవం కేంద్ర ప్రభుత్వం ఇవ్వాలనే ప్రతిపాదన సభ నుంచి వెళ్తే బాగుంటుంది. ఢిల్లీలో అందరు ప్రధానులకు స్మారకం ఉంది. మన పీవీ నరసింహా రావుకు లేదు. అది మనకు అవమానం, తీరని లోటు. ఈ తీర్మానంతోపాటు దానిని కూడా జతపరిచి పంపించనట్లయితే మన గౌరవం కూడా పెరుగుతుంది. సీఎం ప్రవేశ పెట్టిన సంతాప తీర్మానానికి సంపూర్ణ తెలుపుతున్నాం. ఆ కుటుంబానికి ప్రగాఢమైన సానుభూతిని తెలుపుతున్నాం' అని కేటీఆర్ అన్నారు.

## 3డీ వ్యూహంలో రేవంత్ రెడ్డి సర్కార్

(మొదటి పేజీ తరువాయి)

తమపై కేసులు పెట్టినట్లు కేటీఆర్ ఆరోపించారు. కానీ ఏ ఒక్క కేసులోనే పస లేదన్నారు. అన్ని ఉత్తుత్తి కేసులు పెట్టి, న్యాయాన్ని అపహాస్యం చేస్తున్నట్లు విమర్శించారు. ఏసీబీ నమోదు చేసిన కేసులో బలం లేదని సీఎం రేవంత్‌కు తెలుసునని అన్నారు. తెలంగాణ భవన్‌లో ఆయన మీడియాతో చిట్‌చాట్ సందర్భంగా మాట్లాడుతూ.. ఈ-కార్ రేసింగ్ వ్యవహారంలో తాను ఎక్కడ మాట మార్చ లేదని.. చెప్పినదానికే కట్టుబడి ఉన్నానన్నారు. ఈ-కార్ రేసు విషయంలో మంత్రి హోదాలోనే తానే డబ్బులు చెల్లించమన్నానని స్పష్టం చేశారు. నిబంధనల ప్రకారం జరుగకపోతే ఈసీ, ఆర్‌బీఐ వద్దకు ప్రభుత్వం ఎందుకు వెళ్లలేదని ప్రశ్నించారు. డబ్బులు ముట్టిన వారిపై కేసులు ఎందుకు పట్టలేదని నిలదీశారు. ప్రభుత్వం కేసులతో భయపెట్టాలని చూస్తుందని.. వాటిని ఖచ్చితం గా ఎదుర్కొంటామన్నారు. తన కేసుల్లో ఈడీ దూకుడుగా ఉందన్న ప్రచారం జరుగుతోందన్నారు. ఈడీ నుంచి నోటీసు వచ్చిందని.. అందులో ఎలాంటి అనుమానం లేదన్నారు. ఈ విషయంపై కోర్టుకు చెబుతామన్నారు.



## అర్జీలు స్వీకరించి.. పరిష్కారానికి ఆదేశాలు జారీ చేసి.

● కలెక్టర్ సందీప్ కుమార్ ఝా

**బలగం టీవీ ,రాజన్న సిరిసిల్ల:**

జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో సోమవారం ప్రజావాణి నిర్వహించి కలెక్టర్ సందీప్ కుమార్ ఝా, అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్ ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించి, పరిష్కారానికి ఆదేశాలు జారీ చేశారు. అర్జీలను ఆయా శాఖల అధికారులకు అందజేసి, సమస్యను పరిష్కరించాలని సూచించారు.

**ఆయా శాఖలకు వచ్చిన దరఖాస్తులు...**

రెవెన్యూ శాఖకు 56, సిరిసిల్ల మున్సిపల్ కార్యాలయానికి 26, ఎస్పీకి 7, ఎస్ డీ సీ, జిల్లా సంక్షేమ అధికారి కి ఐదు చొప్పున, విద్యా శాఖకు 4, ఉపాధి కల్పన శాఖకు 3, జిల్లా పంచాయతీ అధికారి, హండ్లూమ్ అండ్ టెక్స్టైల్స్, సర్వే, వ్యవసాయ శాఖ, ఎంపీడీఓ ఎల్లారెడ్డి పేటకు రెండు చొప్పున, ఎంపీడీవో కొనరావుపేట, వీర్లపల్లి, వేములవాడ రూరల్, ముస్తాబాద్, గంభిరావుపేట చందుర్తి, డీఎం డబ్ల్యూఓ, ఎల్ డిఎం, ఈఓ వేములవాడ టెంపుల్, లేబర్ ఆఫీసర్, ఇరిగేషన్, ఎంబీ ఇంట్ర, ఏరియా ఆసుపత్రి, ఎస్సీ కార్పొరేషన్,సెస్, అటవీ శాఖకు ఒకటి చొప్పున వచ్చాయి.



## స్పెషల్ డ్రైవ్ నిర్వహించిన పోలీసులు

**బలగం టీవీ , తంగళ్ళపల్లి**

తంగళ్ళపల్లి మండల కేంద్రంలో ఎస్ఐ రామ్మోహన్ స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా మద్యం సేవించి వాహనాలు నడపరాదని ప్రతి ఒక్కరూ డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలని మైనర్లకు వాహనాలు ఇవ్వకూడదని అన్నారు. యువత పాశ్చాత్తా సంస్కృతిలో న్యూ ఇయర్ వేడుకలు నిర్వహించుకునె సందర్భంలో యువకులు డిసెంబర్ 31 పార్టీలతో రోడ్లపై హంగామాలు సృష్టించవద్దన్నారు. ప్రజలకు ఇబ్బంది కలిగించే వారిపై కేసులు నమోదు చేస్తామని,ప్రశాంత వాతావరణంలో న్యూ ఇయర్ వేడుకలు జరుపుకోవాలని తెలిపారు.

## ఆపదలో ఆపన్న హస్తం

**బలగం టీవీ ,తంగళ్ళపల్లి**

తంగళ్ళపల్లి మండల కేంద్రానికి చెందిన పి కృష్ణ ఒక లక్ష రూపాయలు ,బీ.శిరీషకు2,50000 రూపాయల ఎల్ఓసిలను మంజూరు చేసిన కాంగ్రెస్ ప్రభుత్వం. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, కాంగ్రెస్ పార్టీ సిరిసిల్ల నియోజకవర్గ ఇన్చార్జి కేకే మహేందర్ రెడ్డి , కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు జలగం ప్రవీణ్ టోనీ లకు బాధిత కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

## 449 కిలోల గంజాయి దహనం..

**బలగం టీవీ , హైదరాబాద్**

ఖమ్మం జిల్లా తల్లాడ మండలం గోపాలపేట గ్రామ సమీపంలోని ఏడబ్ల్యూఎం కన్సల్టింగ్ లిమిటెడ్‌లో వద్ద ఎక్సైజ్ పోలీసులు 449 కేజీల గంజాయిని దహనం చేశారు. దాని విలువ కోటి 12 లక్షలుగా ఉంటుందని పోలీసులు వెల్లడించారు. ఇటీవల భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని భద్రాచలం ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో ఎక్సైజ్ పోలీసులు రూ.449 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. రాష్ట్ర ఎక్సైజ్ కమిషనర్ ఆదేశాల మేరకు స్వాధీనం చేసుకున్న గంజాయిని తల్లాడ మండలం నరసరావుపేట గ్రామంలో దహనం చేశారు.

## నేడు అర్ధరాత్రి వరకు మెట్రో సర్వీసులు

**బలగం టీవీ , హైదరాబాద్**

నూతన సంవత్సర వేడుకలను పురస్కరించుకుని మంగళవారం అర్ధరాత్రి వరకు మెట్రో రైళ్లను నడిపిస్తున్నట్టు హైదరాబాద్ మెట్రో రైల్ ఎండీ ఎన్వీఎస్ రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. న్యూ ఇయర్ వేడుకుల నేపథ్యంలో ఉదయం 6 నుంచి అర్ధరాత్రి వరకు మెట్రో రైళ్లు తిరుగుతాయని, చివరి రైలు అర్ధరాత్రి (జనవరి 1న) 12.30 గంటలకు బయలుదేరి చివరి స్టేషన్‌కు 1.15 నిమిషాలకు చేరుకునే విధంగా ఏర్పాట్లు చేశామని ఆయన తెలిపారు. మెట్రో రైలు, స్టేషన్లలో సిబ్బంది, పోలీసుల నిఘా ఉంటుందని చెప్పారు.

## ఆక్రమణకు గురైన 2 ఎకరాల భూమి ప్రభుత్వానికి అప్పగింత..

● ప్రభుత్వ భూమిని తిరిగి ప్రభుత్వానికి అప్పగించిన లక్ష్మీపురం మాజీ సర్పంచ్ మిట్టపల్లి పద్మ

● కలెక్టర్ సందీప్ కుమార్ ఝ

**బలగం టీవీ ,రాజన్న సిరిసిల్ల**

రాజన్న సిరిసిల్ల జిల్లాలో ఆక్రమణకు గురైన రెండు ఎకరాల ప్రభుత్వ భూమిని లక్ష్మీపురం మాజీ సర్పంచ్ మిట్టపల్లి పద్మ తిరిగి ప్రభుత్వానికే అప్పగించడం జరిగిందని కలెక్టర్ సందీప్ కుమార్ ఝ అన్నారు .సోమవారం సమీకృత జిల్లా కలెక్టరేట్ ప్రభుత్వ భూమి అప్పగింత పై కలెక్టర్ సందీప్ కుమార్ ఝ ,ఎస్పీ అఖిల్ మహజాన్ తో కలిసి పత్రిక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ సందీప్ కుమార్ ఝ మాట్లాడుతూ తంగళ్ళపల్లి మండలం లక్ష్మీపురం గ్రామ మాజీ సర్పంచ్ మిట్టపల్లి పద్మ 2018 సంవత్సరంలో తాడూరు గ్రామ సర్వే నెంబర్ 545/1/1/3/1 లో గల 2 ఎకరాల భూమి ప్రభుత్వం తనకు కేటాయించిందని, 2 ఎకరాల భూమిని మాజీ సర్పంచ్ పద్మ ప్రభుత్వానికి తిరిగి అప్పగించడానికి నిర్ణయించారని అన్నారు . జిల్లాలో ఎవరైనా భూ ఆక్రమణలకు పాల్పడి ఉంటే సదురు భూమిని ప్రభుత్వానికి స్వచ్ఛందంగా అప్పగించాలని, ఈ భూములను పేద ప్రజల సంక్షేమం కోసం



వినియోగిస్తామని, పేద ప్రజలకు ఇంటి పట్టాల పంపిణీ, ఇందిరమ్మ ఇండ్లు నిర్మించేందుకు వినియోగిస్తామని అన్నారు. 2018 నుంచి 2023 వరకు ప్రభుత్వ భూమి ఆక్రమణలో ఉంటూ రైతు బంధు మొదలైన ప్రభుత్వ పథకాలు లబ్ది పొందినందుకు ఆ సొమ్ము రికవరి కోసం డిమాండ్ నోటీసు జారీ చేస్తామని పేర్కొన్నారు.

## పట్ట భద్రుల తుది ఎమ్మెల్సీ ఎన్నికల ఓటర్ల జాబితా తయారు..

● కలెక్టర్ సందీప్ కుమార్ ఝ

**బలగం టీవీ , రాజన్న సిరిసిల్ల**

రాజన్న సిరిసిల్ల జిల్లాలో ఉమ్మడి కరీంనగర్ జిల్లా పరిధి 874 మంది ఉపాధ్యాయులు, 21 వేల 614 మంది పట్ట భద్రులతో తుది ఎమ్మెల్సీ ఎన్నికల ఓటర్ల జాబితా తయారు చేశామని కలెక్టర్ సందీప్ కుమార్ ఝ సోమవారం ఒక ప్రకటన లో తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా మాట్లాడుతూ ఉపాధ్యాయుల ఎమ్మెల్సీ ఎన్నికల ఓటర్ జాబితాలో వేములవాడ డివిజన్ పరిధిలో 227 మంది పురుషులు, 93 మంది మహిళా ఓటర్లు, సిరిసిల్ల డివిజన్ పరిధిలో 406 మంది పురుషులు, 148 మంది మహిళలు ఓటర్లుగా



నమోదయ్యారని, మొత్తం సిరిసిల్ల జిల్లాలో 633 మంది పురుషులు, 241 మంది మహిళలు మొత్తం 874 మంది ఉపాధ్యాయులతో తుది జాబితా తయారు చేయడం జరిగిందని అన్నారు.


పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ఓటర్ జాబితాలో వేములవాడ డివిజన్ లోని 11 పోలింగ్ కేంద్రాల పరిధిలో 5310 మంది పురుషులు, 3404 మంది మహిళా ఓటర్లు, సిరిసిల్ల డివిజన్ పరిధిలో 7980 మంది పురుషులు, 4920 మంది మహిళలు ఓటర్లుగా నమోదయ్యారని, మొత్తం సిరిసిల్ల జిల్లాలో 13290 మంది పురుషులు, 8324 మంది మహిళలు మొత్తం 21,614 మంది పట్ట భద్రులతో తుది జాబితా తయారు చేయడం జరిగిందని పేర్కొన్నారు.

## 2024 ఐఎండీబీ పాపులర్ సినిమాగా'కల్కి'..

**బలగం టీవీ , హైదరాబాద్**




ఇండియాలో మోస్ట్ పాపులర్ సినిమాల లిస్ట్ రిలీజ్ చేసింది ఐఎండీబీ. 2024 సంవత్సరానికి గాను ఈ లిస్టు ని రిలీజ్ చేశారు. ఈ ఏడాది రిలీజ్ అయిన సినిమాలు లిస్టులో కల్కి మొదటి స్థానాన్ని సంపాదిం చింది. ప్రభాస్ నాగ అశ్విన్ కాంబినేషన్లో తెరకెక్కిన ఈ కల్కి 2898 ఏడీ చిత్రం ఆ అరుదైన ఘనతను సాధించింది. 2024లో అత్యంత ప్రజాదరణ పొందిన పది చిత్రాలలో నెంబర్ వన్ చిత్రంగా నిలిచింది కల్కి. చిత్ర యూనిట్ ఈ ఘనత సాధించినందుకు సంతోషంగా ఉందని ఎక్స్ లో పోస్ట్ చేసింది.అమితాబచ్చన్, దీపికా పదుకొనే, కమల్ హాసన్ తదితరులు నటించిన ఈ చిత్రం వెయ్యి కోట్లకు పైగా కలెక్షన్లను సాధించింది.




## పీఎస్ఎల్వీ సి-60 ప్రయోగం విజయవంతం

**బలగం టీవీ , హైదరాబాద్**

రెండు ఉపగ్రహాలు, 24 పేలోడ్లతో పీఎస్ఎల్వీ సి–60 విజయవంతంగా నింగికెగిసింది. తిరుపతి జిల్లా శ్రీహరికోటలోని సతీష్ ధావన్ అంతరిక్ష కేంద్రంలోని మొదటి ప్రయోగ వేదిక నుంచి బహుళ ప్రయోజనాల రాకెట్ సోమవారం రాత్రి 10 గంటల 15 సెకండ్లకు నింగిలోకి దూసుకెళ్లింది. ఒక్కొక్కటి 220 కిలోల బరువున్న స్పేస్ డాకింగ్ ఎక్స్‌పెరిమెంట్ (స్పేడెక్స్) ఉపగ్రహాలను భూమికి 476 కిలోమీటర్ల అంతరిక్ష కక్ష్యలోకి శాస్త్రవేత్తలు ప్రవేశపెట్టారు. మొదట స్పేడెక్స్–బి ఉపగ్రహం, అనంతరం మరో మూడు సెకండ్ల వ్యవధిలో స్పేడెక్స్–ఎ ఉపగ్రహం రాకెట్ నుంచి విడిపోయాయి. ఈ రెండు స్పేడెక్స్ ఉపగ్రహాలూ విడిపోయిన తర్వాత 15 నిమిషాల 13 సెంకడ్లకు కక్ష్యను మార్చుకు న్నాయి. సుదీర్ఘ సమయం అనంతరం రెండుసార్లు ఆర్బిట్ మార్పులో నాలుగో దశ అంటుకోవడం, మళ్లీ కట్ ఆఫ్, మళ్లీ స్టార్ట్, మళ్లీ కట్ ఆఫ్‌లతో నాలుగో దశలో భూమికి దగ్గరగా ప్రవేశించాయి ఈ తరుణంలో రాకెట్ శీర్ష భాగంలో అమర్చిన 24 పేలోడ్లు అక్కడక్కడా విసిరివేయబడ్డాయి. ఈ పేలోడ్లు భూమికి దగ్గర కక్ష్యలోకి చేరి రాకెట్ ప్రయోగం పూర్తి కావడానికి 95 నిమిషాలు సమయం పట్టింది. ఈ ప్రయోగంలో అత్యంత ముఖ్యమైన స్పేడెక్స్ ఉపగ్రహాలు కక్ష్యలో చేరిన వెంటనే ఈ ప్రయోగం విజయవంతమైనట్లు శాస్త్రవేత్తలు ప్రకటించారు.

# డ్రా కాదు.. ఓటమే..

## కీలక మ్యాచ్‌లో ఓడిన భారత్..! 184 పరుగుల తేడాతో ఆసీస్ విజయం భారత్ డబ్ల్యూటీసీ ఫైనల్ ఆశలు సంక్లిష్టం



**బలగం టీవీ, మెల్‌బోర్న్**

బాక్సింగ్ డే టెస్టులో భారత్ ఘోర పరాజయం చవిచూసింది. కనీసం డ్రా చేస్తారనుకున్నా భారత బ్యాటర్లు విఫలమవ్వడంతో ఆసీస్ 184 పరుగుల తేడాతో నెగ్గింది. 340 పరుగుల లక్ష్య ఛేదనలో దిగిన భారత్ 155 పరుగులకు ఆలౌటైంది. యశస్వీ జైస్వాల్ (84 పరుగులు) ఒక్కడే రాణించాడు. రిషబ్ పంత్ (30 పరుగులు) ఫర్వాలేదనిపించాడు. మిగతా బ్యాటర్లెవరూ రెండంకెల స్కోర్ చేయలేదు. ఆసీస్ బౌలర్లలో కమిన్స్, స్కాట్ బొలాండ్ చెరో 3, లియాన్ 2, స్టార్క్, హెడ్ తలో 1 వికెట్ దక్కించుకున్నారు. దీంతో 5 టెస్టుల సిరీస్‌లో ఆసీస్ 2-1తో ఆధిక్యంలోకి దూసుకెళ్లింది.

340 పరుగుల భారీ లక్ష్యచేధనకు బరిలోకి దిగిన టీమిండియా రెండో ఇన్నింగ్స్‌లో 155 పరుగులకు కుప్పకూలింది. యశస్వి జైస్వాల్(208 బంతుల్లో 8 ఫోర్లతో 84) ఒంటరి పోరాటం చేయగా మిగతా బ్యాటర్లు దారుణంగా విఫలమయ్యారు. ప్యాట్ కమిన్స్(3/28), స్కాట్ బోలాండ్(3/39) మూడేసి వికెట్లు తీయగా.. నాథన్ లయన్ (2/37) రెండు వికెట్లు పడగొట్టాడు. మిచెల్ స్టార్క్, ట్రావిస్ హెడ్ తలో వికెట్ తీసారు. మరో 12 ఓవర్ల పాటు భారత్ క్రీజులో కొనసాగి ఉంటే ఈ మ్యాచ్‌లో ఓటమి నుంచి గట్టెక్కేది. ఓ దశలో రిషభ్ పంత్(30), యశస్వి జైస్వాల్ నాలుగో వికెట్‌కు 78 పరుగుల భాగస్వామ్యంతో ఈ మ్యాచ్ డ్రా దిశగా సాగింది. దాదాపు ఈ ఇద్దరూ 22 ఓవర్ల పాటు బ్యాటింగ్ చేశారు. ఈ ఇద్దర్నీ ఔట్ చేయలేక ఆసీస్ బౌలర్లు చేతులెత్తేసారు. ఈ క్రమంలో పార్ట్ టైమ్ బౌలర్ ట్రావిస్ హెడ్.. టెంప్టింగ్ బాల్‌తో రిషభ్ పంత్‌ను బుట్టలో వేసుకున్నాడు. నిర్లక్ష్యపు షాట్ రిషభ్ పంత్ వెనుదిరగడంతో భారత ఇన్నింగ్స్ పేకమేడల్లా కుప్పకూలింది. రవీంద్ర జడేజా, సెంచరీ హీరో నితీష్ కుమార్ రెడ్డి(1) వెనువెంటనే ఔటవ్వడంతో ఈ మ్యాచ్‌పై ఆసీస్ పట్టు బిగించింది. నిలకడగా ఆడుతున్న యశస్వి జైస్వాల్ కూడా ఔటవ్వడంతో ఆసీస్ విజయం సునాయసమైంది.

ఈ ఓటమితో ఐదు టెస్టల సిరీస్‌లో ఆసీస్ 2-1తో ఆధిక్యంలో నిలిచింది. ఆఖరి టెస్ట్ జనవరి 3 నుంచి సిడ్నీ వేదికగా జరగనుంది. ఈ ఓటమితో డబ్ల్యూటీసీ ఫైనల్ రేసు నుంచి టీమిండియా ఆశలు సంక్లిష్టమయ్యాయి.

ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్ చేసిన ఆసీస్.. తొలి ఇన్నింగ్స్‌లో 474 పరుగుల భారీ స్కోర్ చేయగా.. భారత్ 369 పరుగులకు ఆలౌటైంది. రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన ఆసీస్ రెండో ఇన్నింగ్స్‌లో 234 పరుగులకు ఆలౌటైంది.

## డబ్ల్యూటీసీ ఫైనల్‌కు దక్షిణాఫ్రికా



**బలగం టీవీ, హైదరాబాద్**

వరల్డ్ టెస్ట్ చాంపియన్‌షిప్ (డబ్ల్యూటీసీ) 2023-25 సైకిల్‌లో దక్షిణాఫ్రికా ఫైనల్ చేరింది. స్వదేశంలో పాకిస్థాన్‌తో జరిగిన తొలి టెస్టులో సఫారీలు థ్రిల్లింగ్ విక్టరీ సాధించి ఈ టోర్నీలో సగర్వంగా ఫైనల్ పోరుకు అర్హత సాధించారు. సెంచూరియన్ వేదికగా జరిగిన ఈ మ్యాచ్‌లో 148 పరుగుల ఛేదనలో భాగంగా ఓవర్ నైట్ స్కోరు 27/3తో ఐదో రోజు ఆట ఆరంభించిన సౌతాఫ్రికా.. ఒకదశలో 95/4తో పటిష్ట స్థితిలోనే నిలిచింది. కానీ ఐదు పరుగుల వ్యవధిలో ఆ జట్టు ఏకంగా 4 వికెట్లు కోల్పోవడంతో ఒక్కసారిగా పాకిస్థాన్ గెలుపు రేసులోకి వచ్చింది. మహ్మద్ అబ్బాస్ (6/54) అద్భుత బౌలింగ్‌తో సఫారీలను ఆందోళనకు గురిచేశాడు. కానీ లోయరార్డర్‌లో అనుభవజ్ఞుడైన కగిసో రబాడా (26 బంతుల్లో 31 నాటౌట్, 5 ఫోర్లు), మార్కో యాన్సెన్ (24 బంతుల్లో 16 నాటౌట్, 3 ఫోర్లు) దక్షిణాఫ్రికాను (150/8) విజయతీరాలకు చేర్చారు.

## చెంచుల యువరాణిగా ప్రీతి ముకుందన్..

**బలగం టీవీ, హైదరాబాద్**

మంచి విష్ణు డ్రీమ్ ప్రాజెక్ట్ గా రాబోతున్న భారీ బడ్జెట్ మూవీ కన్నప్ప చిత్రం నుంచి హీరోయిన్‌కి సంబంధించిన బ్యూటిఫుల్ పోస్టర్‌ని వదిలింది. ఈ సినిమాలో హీరోయిన్ ప్రీతి ముఖుంధన్ రోల్ ఎలా ఉండబోతుందో తెలుపుతూ తాజాగా ఓ పోస్టర్‌ని మేకర్స్ రిలీజ్ చేశారు. ఈ పోస్టర్ ప్రకారం 'కన్నప్ప'లో ప్రీతి ముఖుందన్ నెమలిగా కనిపించబోతుంది. . "అందంలో సహజం, తెగింపులో సాహసం, ప్రేమలో అసాధారణం, భక్తిలో పారవశ్యం, కన్నప్పకు సర్వస్వం, చెంచు యువరాణి నెమలి" అంటూ తాజాగా వదిలిన ఈ పోస్టర్ పై రాసిన పదాలు ఈ క్యారెక్టర్ పట్ల క్యూరియాసిటీని పెంచుతున్నాయి. ఈ చిత్రానికి ముఖేష్ కుమార్ సింగ్ డైరక్షన్ వహిస్తుండగా దీనిని 24 ఫ్రేమ్స్ బ్యానర్స్ పై మోహన్ బాబు నిర్మిస్తున్నారు. ఈ మూవీలో ప్రభాస్, అక్షయ్ కుమార్, మోహన్ లాల్, మోహన్ బాబు వంటి స్టార్స్ నటిస్తున్నారు. దీంతో సినిమాపై భారీ అంచనాలు ఉన్నాయి. కన్నప్ప మూవీ వచ్చే ఏడాది ఏప్రిల్ 25 న థియేటర్లలో విడుదల అవుతుంది



## అల్లు అర్జున్ బెయిల్ పిటిషన్‌పై తీర్పు వాయిదా

**బలగం టీవీ, హైదరాబాద్**

సంధ్య థియేటర్ వద్ద జరిగిన తొక్కిసలాట కేసులో సినీనటుడు అల్లు అర్జున్ దాఖలు చేసిన బెయిల్ పిటిషన్‌పై నాంపల్లి కోర్టులో విచారణ జరిగింది. ఈ పిటిషన్‌పై అల్లు అర్జున్‌కి బెయిల్ ఇవ్వొద్దంటూ చిక్కడపల్లి పోలీసులు కౌంటర్ పిటిషన్ దాఖలు చేసిన విషయం తెలిసిందే. దీంతో ఈ రెండు పిటిషన్‌లపై విచారణ జరిగింది. అల్లు అర్జున్ తరపు లాయర్‌లు బెయిల్ మంజూరు చేయాలంటూ తమ వాదనలు ధర్మాసనంకు వినిపించారు. అయితే ఇరు పక్షల వాదానలు విన్న నాంపల్లి కోర్టు.. తీర్పును జనవరి 3కు వాయిదా వేసింది. తొకిసలాట ఘటనలో పోలీసులు ఇటీవల అల్లు అర్జున్‌ను అరెస్ట్ చేసిన విషయం తెలిసిందే. అయితే అదే రోజు హైకోర్టు మధ్యంతర బెయిల్ మంజూరు చేయడంతో ఆయన జైలు నుంచి విడుదలయ్యారు. నాలుగు వారాలపాటు ఈ బెయిల్‌ను మంజూరుచేసిన కోర్టు రూ.50 వేల వ్యక్తిగత బాండ్లు జైలు సూపరింటెండెంట్‌కు సమర్పించాలని ఆదేశించింది.

## డబ్ల్యూటీసీ ఫైనల్‌కు భారత్ దారి ఇదే..




**బలగం టీవీ, హైదరాబాద్**

మెల్‌బోర్న్ టెస్టులో ఓటమితో భారత్‌కు 2025 వరల్డ్‌టెస్టు ఛాంపియన్‌షిప్ ఫైనల్ కు దాదాపు దారులు మూసుకుపోయాయి. డబ్ల్యూటీసీ పాయింట్స్ టేబుల్‌లో ప్రస్తుతం భారత్ మూడో స్థానంలో కొనసాగుతోంది. తాజా పరాజయంతో భారత్ విన్నింగ్ పర్సంటేజ్ 55.89 నుంచి 52.77కి పడిపోయింది. మరోవైపు ఆసీస్ తాజా విజయంతో విన్నింగ్ పర్సంటేజ్ 61.46 శాతానికి పెంచుకొని ఫైనల్ బెర్త్ అవకా శాలను మెరుగుపరుచుకుంది.

ఇక భారత్ ఫైనల్ చేరాలంటే కొన్ని ఫలితాలు భారత్‌కు అనుకూలంగా రావాలి. అలాగే డబ్ల్యూటీసీ 2023-25 సైకిల్‌లో భారత్‌కు ఒక్క మ్యాచ్ మాత్రమే మిగిలి ఉంది. ఆ మ్యాచ్ భారత్ కచ్చితంగా గెలవాలి ఈ ఆఖరి టెస్టులో గెలిచినా, టీమ్‌ఇండియా ఫైనల్‌కు చేరాలంటే ఇతర జట్ల ఫలితాలపై ఆధారపడాలి.

కొత్త సంవత్సరంలో ఆస్ట్రేలియా శ్రీలంక పర్యటనకు వెళ్లనుంది. ఈ పర్యటనలో శ్రీలంకతో ఆసీస్ రెండు టెస్టుల సిరీస్ ఆడాల్సి ఉంది. ఈ సిరీస్‌లో ఆసీస్ 0- 2 తో ఓడితే, భారత్‌కు ఛాన్స్ ఉంటుంది. అప్పుడు భారత్ ఖాతాలో 55.26 పర్సెంటేజీ ఉంటుంది. ఆస్ట్రేలియా 53.51 శాతానికి పడిపోతుంది. ఇక శ్రీలంక 53.85 శాతం వద్దే నిలిచిపోతుంది. అయితే ఆస్ట్రేలియాపై భారత్ ఆఖరి టెస్టులో గెలిస్తేనే ఈ సమీకరణాలు ముందుకొస్తాయి.

ఒకవేళ శ్రీలంకతో టెస్టు సిరీస్‌లో రెండు మ్యాచ్‌లు డ్రా అయితే, అప్పుడు మెరుగైన స్థానంలో ఉన్న జట్టు టాప్ 2 లోకి చేరుతుంది. బోర్డర్ గావస్కర్ ట్రోఫీలో చివరి టెస్టులో భారత్ నెగ్గినప్పటికీ, శ్రీలంకతో సిరీస్‌లో ఆస్ట్రేలియా ఒక్క మ్యాచ్‌లో విజయం సాధించినా, టీమ్‌ఇండియా అవకాశాలు గల్లంతే. బోర్డర్- గావస్కర్ ట్రోఫీలో చివరి టెస్టులో భారత్ ఓడినా, మ్యాచ్‌ను డ్రా గా ముగించినా అధికారికంగా ఫైనల్ రేసు నుంచి టీమ్‌ఇండియా నిష్క్రమిస్తుంది.

## టెస్టు క్రికెటర్ ఆఫ్ ది ఇయర్ నామినేషన్‌లలో బుమ్రా




**బలగం టీవీ, హైదరాబాద్**

2024 ఏడాదికి గాను 'ఐసీసీ టెస్టు క్రికెటర్ ఆఫ్ ది ఇయర్ నామినేషన్‌లలో భారత బౌలింగ్ దిగ్గజం జస్ప్రీత్ బుమ్రాకు చోటు దక్కింది. ఇంగ్లండ్‌కు చెందిన బ్యాటర్‌లు జోయ్ రూట్ , హ్యారీ బ్రూక్.. శ్రీలంకకు చెందిన కామిందు మెండిస్‌లతోపాటు బుమ్రా కూడా ఐసీసీ టెస్టు క్రికెటర్ ఆఫ్ ది ఇయర్ రేసులో ఉన్నాడు.

బుమ్రా 2024లో 13 టెస్టు మ్యాచ్‌లు ఆడి 14.92 సగటు, 30.16 స్ట్రైక్ రేట్‌తో 71 వికెట్లు పడగొట్టాడు. దాంతో టెస్టు క్రికెట్ చరిత్రలో మరే బౌలర్ సాధించలేని ఘనత సాధించాడు. భారత్-ఆస్ట్రేలియా మధ్య కొనసాగుతున్న బోర్డర్-గవాస్కర్ ట్రోఫీలో కూడా బుమ్రా అద్భుతంగా రాణిస్తున్నాడు. కేవలం 4 టెస్టు మ్యాచ్‌లలో 30 వికెట్లు తీసి బెస్ట్ బౌలర్‌గా ఉన్నాడు. ఇక ఇంగ్లండ్ బ్యాటర్ రూట్ 2024లో 17 టెస్టులు ఆడి 55.57 సగటుతో ఏకంగా 1,556 పరుగులు సాధించాడు. ఇంగ్లండ్‌కే చెందిన మరో బ్యాటర్‌బ్రూక్ కూడా ఈ ఏడాది 12 టెస్టుల్లో 1,100 పరుగులు చేసి నామినేషన్‌లలో చోటు సంపాదించాడు.

## గేమ్ ఛేంజర్' ప్రీ రిలీజ్ ఈవెంట్‌కు పవన్ కల్యాణ్

**బలగం టీవీ, హైదరాబాద్**



గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ తేజ్ , దిగ్గజ దర్శకుడు శంకర్ కాంబినేషన్‌లో వస్తున్న తాజా చిత్రం గేమ్ ఛేంజర్. ఈ సినిమాను అగ్ర నిర్మాత దిల్ రాజు నిర్మిస్తుండగా.. థమన్ సంగీతం అందిస్తున్నాడు. ఈ సినిమా సంక్రాంతి కానుకగా జనవరి 10న ప్రేక్షకుల ముందుకు రానున్న విషయం తెలిసిందే. అయితే ఈ సినిమా ప్రమోషన్స్‌లో భాగంగా.. ప్రీ రిలీజ్ వేడుకను ఆంధ్రప్రదేశ్‌లో నిర్వహించబోతున్న విషయం తెలిసిందే. ఈ వేడుకకు ముఖ్య అతిథిగా ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌ను ఆహ్వానించడానికి నిర్మాత దిల్ రాజు పవన్ కళ్యాణ్‌తో మంగళగిరి జనసేన కార్యాలయంలో భేటీ అయ్యాడు. ప్రీ రిలీజ్ ఈవెంట్‌కి చీఫ్ గెస్ట్‌గా పవన్ రావాలని దిల్ రాజు కోరడంతో జనసేనాని ఒకే చెప్పినట్లు తెలుస్తుంది. ఇక ఈ ప్రీ రిలీజ్ వేడుకను జనవరి 04న రాజమండ్రిలో నిర్వహించబోతున్నట్లు సమాచారం.